క్లుప్తంగా

సహకార సంఘం చైర్మన్ రాజీనామా

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల సహకార సంఘం చైర్మన్ దూదేకుల రహ్మతుల్లా తన పదవికి రాజీనామ చేశారు. ఈ మేరకు సోమవారం రాజీనామా పత్రాన్ని సహకార సంఘం సీఈఓ మండ్ల పెద్దయ్యకు అందజేశారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి చెందడంతో స్వచ్ఛందంగా పదవికి రాజీనామా చేసినట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి డ్యాన్స్ పోటీల్లో చిన్నారుల ప్రతిభ



ప్రథమ బహుమతి కైవసం చేసుకున్న సీనియర్ గ్రూప్ సభ్యులు

బేతంచెర్ల: తెలంగాణ రాష్ట్రం పేబ్బేరులో ఎస్ఆర్టీ డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో బేతంచెర్ల డీజే మధు డ్యాన్స్ స్టూడియో చిన్నారులు ప్రతిభ చాటారు. సీనియర్ గ్రూప్‌లో మొదటి బహుమతి రూ.20 వేలు, జూనియర్ గ్రూప్‌లో ద్వితీయ స్థానం కైవసం చేసుకొని రూ.10 వేల నగదు బహుమతి అందుకున్నారు. ప్రతిభ చాటిన చిన్నారులను పట్టణ ప్రజలు అభినందించారు.

మీట్ కార్పొరేషన్ చైర్మన్ పదవికి రాజీనామా



రాజీనామా పత్రాన్ని చూపుతున్న శ్రీరాములు

డోన్: రాష్ట్ర మీట్ కార్పొరేషన్ (మాంస ఉత్పత్తుల సంస్థ) చైర్మన్ శ్రీరాములు సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌కు ఫ్యాక్స్ ద్వారా పంపినట్లు ఆయన తెలిపారు. తనకు రాష్ట్రస్థాయి చైర్మన్ పదవి అప్పగించిన అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్ రాజీనామా

కోవెలకుంట్ల: ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పదవికి కోవెలకుంట్లకు చెందిన కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం రాజీనామా చేశారు. 2022 నుంచి ఆమె ఈ పదవిలో కొనసాగుతున్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో వైఎస్సార్‌సీపీ పరాజయం చెందడంతో పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను ఫ్యాక్స్ ద్వారా ఆ శాఖ ఎండీకి పంపినట్లు ఆమె పేర్కొన్నారు.

చెరువు భూముల ఆక్రమణపై విచారణ



చెరువు వద్ద వేసిన వెంచర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్

ప్యాపిలి: పట్టణ సమీపంలోని నాయిన్ చెరువు భూములు ఆక్రమణకు గురైనట్లు ఫిర్యాదు అందిన నేపథ్యంలో తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి సోమవారం విచారణ చేపట్టారు. 896 సర్వే నంబర్‌లో స్థలాన్ని ఆక్రమించి అనంతపురం పట్టణానికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంచర్ వేసినట్లు గత నెల 31న పట్టణానికి చెందిన రైతులు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. స్పందించిన తహసీల్దార్ సోమవారం చెరువు వద్దకు చేరుకుని విచారణ చేపట్టారు. వెంచర్ వేసిన స్థలాన్ని పరిశీలించారు. చెరువు స్థలాన్ని పూర్తిగా సర్వే చేయించి సరిహద్దులు ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. చెరువు స్థలాన్ని ఆక్రమించినట్లు సర్వేలో వెల్లడైతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

యాగంటిలో ఘనంగా పల్లకీ మహోత్సవం



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: ప్రముఖ శైవక్షేత్రమైన యాగంటిలోని ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకీ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రదోషకాల పూజలు చేశారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి పల్లకీలో నంది మండపం వరకు తీసుకెళ్లారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయాధికారి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

తీరిన రహదారి సమస్య

- రూ.68లక్షలతో రోడ్డు నిర్మాణం
- తీరిన ఏపీ మోడల్, గురుకుల, కస్తూర్బా విద్యార్థుల సమస్య
- కోట్ల ఔట్‌డోర్ స్టేడియం, ఏపీ స్టేట్ హౌసింగ్ సంస్థ ఉద్యోగులకు ఊరట
- దశాబ్దాల సమస్యకు పరిష్కారం

దశాబ్దాలుగా పేరుకు పోయిన సమస్యలకు పరిష్కారం చూపింది గత ప్రభుత్వం. వైఎస్సార్ హయాంలో ఏర్పాటు చేసిన విద్యాలయాలకు తరువాత వచ్చిన ప్రభుత్వాలు కనీసం రహదారి ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. అలా దశాబ్దాలు గడిచినా పట్టించుకోలేదు. చివరకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి బుగ్గన చొరవతో రూ.68లక్షలతో రహదారి నిర్మించారు. దీంతో వందలాది మంది విద్యార్థులు, బోధన, బోధనేతర సిబ్బందికి అవస్థలు తప్పాయి.



నేడు: నూతనంగా వేసిన రోడ్డు



నాడు : అధ్వానంగా మోడల్ స్కూల్‌కు వెళ్లే రహదారి

డోన్: 2006లో నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గానికి మోడల్, ఏపీ గురుకుల, కస్తూర్బా పాఠశాల, కళాశాలలతో పాటు కోట్ల ఔట్‌డోర్ స్టేడియం, ఏపీ స్టేట్ వేర్ హౌసింగ్ గోడౌన్లను అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మంజూరు చేశారు. వీటిని ఉడుములపాడు వద్ద 44వ జాతీయ రహదారి నుంచి కిలోమీటర్నర దూరంలో నిర్మించారు. అయితే వాటికి సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, క్రీడాకారులు, గోడౌన్ కార్మికులు ఇబ్బందులు పడ్డారు. రోడ్డు వేయాలని గతంలో పలుమార్లు టీడీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నాడు పట్టించుకోలేదు. ఆ తరువాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టాక సమస్య తీవ్రతను నాటి ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రోడ్డు నిర్మాణం ఆవశ్యకతను వివరించారు. స్పందించిన సీఎం రూ.68 లక్షలు మంజూరు చేశారు. దీంతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఏడాది క్రితం పనులు పూర్తయ్యాయి.

రూ.68లక్షలతో రహదారి నిర్మాణం..

దశాబ్ద కాలంగా అధ్వానంగా ఉన్న రహదారిని ఏడాది క్రితం అప్పటి రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో రూ.68 లక్షలతో నూతన రోడ్డు నిర్మించారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఏడాది నుంచి సౌకర్యవంతంగా రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నెల 13వ తేదీన పాఠశాలలు పునః ప్రారంభం అవుతుండటంతో ఈ రహదారి మళ్లీ విద్యార్థులతో కళకళలాడనుంది. ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం ఆర్టీసీ ఉచిత బస్సులను నడుపుతున్నందున సకాలంలో పాఠశాలలకు ఉపాధ్యాయులు, విద్యార్థులు చేరుకునే వీలు కలిగింది. గుంతలమయమైన రహదారి వర్షాకాలంలో మరింత అధ్వానంగా మారి తరచూ వాహన ప్రమాదాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు గాయపడేవారు. నూతన రహదారి నిర్మాణంతో వారికి ఆ ఇబ్బందులు తీరాయి.

రోడ్డు వేస్తారని ఊహించలేదు



దశాబ్ద కాలంగా రహదారిని నిర్మించాలని పలువురిని కోరినా ఫలితం లేకపోయింది. రహదారి అధ్వానంగా ఉన్న సమయంలో విద్యార్థులతో పాటు తాము పడిన బాధలు వర్ణనాతీతం. ఇన్నేళ్లకు తమ బాధలు తీరినందుకు సంతోషంగా ఉంది.

– రెబకా, కేజీబీవీ వ్యాయామ ఉపాధ్యాయురాలు

ఇబ్బందులు పడకుండా వెళ్తున్నాం



రోజు స్కూల్, కళాశాలలకు వెళ్లాలంటే నరకయాతన అనుభవించాల్సి వచ్చేది. పలుమార్లు ద్విచక్ర వాహనాలు, ఆటోలు ప్రమాదాలకు గురై విద్యార్థులు గాయపడ్డారు. ప్రస్తుతం రహదారి ఏర్పడటంతో సకాలంలో స్కూల్‌కు వెళ్లగలుగుతున్నాం. ఆ ఇబ్బందులు ఇప్పుడు లేవు.

– మౌలాబీ, జూనియర్ బైపీసీ, మోడల్ స్కూల్

సంతోషంగా ఉంది



చక్కటి రహదారి, ఆహ్లాదకరమైన వాతావరణం, పరిసరాల పరిశుభ్రత ఉంటేనే విద్యార్థులు ప్రశాంతంగా చదువుకోగలుగుతారు, మానసికంగా ఎదగగలుగుతారు. ఇందుకు అనువైన వాతావరణం ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఉన్నందువల్ల విద్యార్థులు అత్యధి సంఖ్యలో ఉత్తీర్ణులవుతున్నారు.

– నాగజాస్మిన్, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్

మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు



ముచ్చట్లలో పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: మండలంలోని హెచ్.కొట్టాల గ్రామ సమీపంలో వెలసిన ముచ్చట్ల భ్రమరాంబ, మల్లికార్జునస్వామి ఆలయంలో జ్యేష్ఠ మాసం.. సోమవారం సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భ్రమరాంబ, మల్లికార్జున స్వామికి రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం, బిల్వార్చన, కుంకుమార్చన, మహామంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

మహానందీశ్వరుడికి పల్లకీసేవ

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని, నాగేశ్వరశర్మ, హనుమంత శర్మ, ఆంజనేయ శర్మ, అర్చకులు మహానందీశ్వర ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార హారతులిచ్చి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువు చేశారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు చేస్తే సహించం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె: టీడీపీ అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడుతున్నారని, ఇలాగే కొనసాగితే సహించే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. సోమవారం బనగానపల్లెలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సంయమనం పాటిస్తున్నామని అన్నారు. తమ సహనాన్ని చేతకాని తనంగా తీసుకోవద్దన్నారు. టీడీపీ కార్యకర్తలు దాడులకు పాల్పడితే తిప్పికొట్టాల్సి వస్తుందని, తర్వాత పర్యావసానాలు వేరుగా ఉంటాయని హెచ్చరించారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి 85వేల ఓట్లు వేసిన బనగానపల్లె నియోజకవర్గ ప్రజలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధికి సహకరించిన అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వైఎస్సార్‌సీపీ పాలనలో కులమతాలు, పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించామన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో సంక్షేమ పథకాల కోసం రూ.1645 కోట్లు ఖర్చు చేశామని చెప్పారు. ఈ ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతి పరులపై దాడులు చేయడం హేయమైన చర్య అన్నారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయని, ఎవరూ కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడలేదన్నారు. అయితే ఈసారి టీడీపీ కొత్త సంప్రదాయాలకు తెరలేపిందన్నారు. టీడీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నా సంయమనం పాటిస్తున్నామని, ఇకపై ఉపేక్షించని స్పష్టం చేశారు. ప్రజలు ఎంతో నమ్మకంతో కొత్త ప్రభుత్వానికి మద్దతు తెలిపారని, అభివృద్ధిపై దృష్టి పెడితే బాగుంటుందని హితవుపలికారు. అలా కాకుండా కక్ష్య సాధింపు చర్యలకు పాల్పడితే దాడులను తిప్పి కొట్టడానికి తాను సిద్ధంగా ఉన్నానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు.

అలరించిన భజన కార్యక్రమం



భజన కార్యక్రమం నిర్వహిస్తున్న కళాకారులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా సోమవారం ఎస్ పెద్ద పుల్లమ్మ బృందం, మహానంది, నంద్యాల జిల్లా వారిచే భజన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద నిర్వహించిన కార్యక్రమములో వినాయక దేవగణేశ, శ్రీశైలం శివమయం, శివశివయ నరాదా. మనసారా నిన్నే కొలిచితిని, శ్రీమల్లికార్జున దయచూపరా, శివనామమంత్రం, ఓం నమఃశివాయ, అమ్మపరమేశ్వరి, శంభో... శివశంభో, శ్రీశైలం శివమయం తదితర భక్తిగీతాలు, అష్టకాలను ఎస్. పెద్దపుల్లమ్మ, ఎస్. రంగయ్య, ఆర్. ముకుందరావు, ఎం.ప్రతాప్, టి. నవీన్ కుమార్, రామేశ్వరరెడ్డి, తదితరులు ఆలపించారు.

సారా స్వాధీనం.. ఐదుగురి అరెస్ట్



నాటు సారాను చూపుతున్న సెబ్ అధికారులు

కోడుమూరు రూరల్: కోడుమూరు సెబ్ పరిధిలోని వెల్దుర్తి మండలం రత్నపల్లెకు చెందిన ఈడిగ వెంకటేష్, వెల్దుర్తికి చెందిన దూల రామచంద్రుడులను సోమవారం అదుపులోకి తీసుకుని 26 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రామాంజనేయులు తెలిపారు. అలాగే గతంలో నాటుసారా తయారీ కేంద్రాలు నిర్వహిస్తూ పరారీలో ఉన్న వెల్దుర్తి మండలం ఎల్.బండకు చెందిన ఘమికిబాయి, బద్దీబాయి, కర్ణాటక మద్యం తరలింపు కేసులో నిందితుడిగా ఉన్న క్రిష్ణగిరి మండలం సంగాల వాసి నంద్యాల మద్దయ్యలను అదుపులోని తీసుకుని డోన్ కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ వెల్లడించారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ధనలక్ష్మి

బనగానపల్లె: రైతులు యాజమన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చని కేవీకే సీనియర్ సైంటిస్ట్ డాక్టర్ జి.ధనలక్ష్మి అన్నారు. సోమవారం బనగానపల్లె మండలం యాగంటిపల్లె గ్రామంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ.. ప్రస్తుతం వంటనూనెలు అధికంగా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. దీన్ని అధిగమించేందుకు నూనె గింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం నూనె గింజల సాగును ప్రోత్సహిస్తోందని చెప్పారు. నాణ్యమైన విత్తనం 25 శాతం వరుకు దిగుబడులకు కారణమన్నారు. మేలైన యాజమన్య పద్ధతులను పాటించి ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. సోయా చిక్కుడులో ఎరువుల యామాన్య పద్ధతులను వివరించారు. ఎండుతెగుళ్లు, వేరుతెగుళ్లు, తెల్లతెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన పద్ధతులను తెలియజేశారు. కార్యక్రమంలో భూ విజ్ఞాన శాస్త్రవేత్త రమణయ్య, సస్య రక్షణ శాస్త్రవేత్త బాలరాజు, సేద్య విభాగ శాస్త్రవేత్త సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణంలో ఉన్న వాటికి అనుమతులా



నిర్మాణంలో ఉన్న స్కూల్ భవనం

డోన్ టౌన్ : స్కూల్ భవన నిర్మాణ పనులు జరుగుతుండగానే పాఠశాల నిర్వహణకు అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ షాహిద్, ఎస్ఎస్‌యూఐ జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్ ప్రశ్నించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ పట్టణంలో నూతనంగా భాష్యం స్కూల్ ఏర్పాటుపై అధికారుల తొందరపాటు చర్య తగదన్నారు. భవన నిర్మాణం పూర్తి కాకపోయినా అడ్మిషన్లు చేస్తున్నారన్నారు. నిర్మాణం జరిగే సమయంలో తరగతులు నిర్వహిస్తే ఏదైనా ప్రమాదం చోటు చేసుకుంటే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అనుమతులు రద్దు చేయకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఎస్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు మధు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా వంతెనలు

- రక్షణ గోడ లేక ప్రమాదాలు



శిథిలావస్థకు చేరిన కొలిమిగుండ్ల సమీపంలోని డాఖానాయక్ బ్రిడ్జి

కొలిమిగుండ్ల: నిత్యం వందలాది వాహనాలు తిరిగే ప్రధాన రహదారుల్లో నిర్మించిన వంతెనలు ప్రమాదకరంగా మారుతున్నాయి. రాకపోకలు సాగించే సమయంలో ఎక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటాయోనని వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. నెల్లూరు–ముంబై ప్రధాన రహదారిలోని కొలిమిగుండ్ల సమీపంలోని డాఖానాయక్ బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకుంది. రక్షణ గోడలు పూర్తిగా దెబ్బతిన్నాయి. రెండు వాహనాలు ఎదురెదురుగా ప్రయాణించలేని పరిస్థితి నెలకొంది. పలుమార్లు రక్షణ గోడ నిర్మిస్తున్నా నెల రోజులు కూడా ఉండడం లేదు. కల్వటాల సమీపంలోని మరో కల్వర్టుపై రక్షణ గోడ లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రెండు చోట్ల వర్షాకాలంలో భారీగా వరద నీరు ప్రవహిస్తుంటాయి. వంతెనలు రోడ్డుకు తక్కువ ఎత్తులో ఉండడంతో భారీ వర్షం కురిసినప్పుడు నీరు రోడ్డుపై ప్రవహిస్తుంటుంది. రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకుని వంతెనల సామర్థ్యాన్ని పెంచి ప్రమాదాలు సంభవించకుండా చూడాలని వాహనచోదకులు కోరుతున్నారు.



కల్వటాలలో రక్షణ గోడ లేక..

స్నేహితుడి కుటుంబానికి అండగా..

బేతంచెర్ల: మండలంలోని సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన లూకా ప్రకాశ్ గతనెల 20న అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన 1989–90 పాణ్యం సిమెంట్ హైస్కూల్ 10వ తరగతి పూర్వ విద్యార్థులు స్వాములు, నాగరాజు, చంద్ర బాల, రాజేశ్వరి, తిరుపతయ్య, రాఘవ, తిమ్మప్ప మిత్రుడు మృతి పట్ల సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. మిత్రుడి కుటుంబ పరిస్థితి తెలుసుకొని రూ. 22 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

మెగా డీఎస్సీ నిర్వహించాలి

కోవెలకుంట్ల: మెగా డీఎస్సీ ద్వారా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు అందనం దేవరాజు కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశా లల్లో 45 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేస్తామని చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారన్నారు. ప్రభు త్వం అధికారం చేపట్టిన వెంటనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నిరుద్యోగ సంఘం నాయకులు రహీం, నాగరాజు, పరంధామ, సుబ్బయ్య పాల్గొన్నారు.

కుక్కల దాడిలో జింకపిల్లకు గాయాలు

మహానంది: శిరివెళ్ల మండలం గోవిందపల్లిలో వీధి కుక్కలు జింక పిల్లపై దాడి చేయడంతో గాయపడింది. విషయం తెలుసుకున్న పోలీసులు జింకను పట్టుకొని అటవీశాఖ అధికారులకు అప్పగించారు. చికిత్స నిమిత్తం అటవీశాఖ సిబ్బంది గాజులపల్లె పశు సంచార వాహనం దగ్గరకు తీసుకొచ్చి ఇంజక్షన్లు వేయించారు. జింక పిల్ల ఆరోగ్యం మెరుగుపడిన అనంతరం అడవిలో వదిలిపెడతామని కోటకొండ ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రామేశ్వరి తెలిపారు.

అంగన్‌వాడీబాటపై ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

కోవెలకుంట్ల: మూడేళ్ల నిండి ఆరు సంవత్సరాల్లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని సోమవారం కోవెలకుంట్ల పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గీతాలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు నస్రీన్, లక్ష్మీదేవి, మల్లిక, అరుణ, కమల, గంగమ్మ, సరస్వతి ఆధ్వర్యంలో చిన్నారులు, తల్లులు పట్టణంలో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యతోపాటు మధ్యాహ్న భోజనం, ప్రతి రోజు గుడ్డు, పౌష్టికాహారం అందజేస్తున్నామని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు.



చింత చెట్టుకు నిండుగా ఉన్న చింత చిగురు

కమ్మని చింతచిగురు



చింత చిగురు

సంజామల: ఖరీఫ్ సీజన్‌లో కురిసే తొలకరి చినుకులకు చింత చెట్టుకు చిటారు కొమ్మలో కొత్త బంగారంలా మెరుస్తుంటుంది చింతచిగురు. చింత చిగురు తింటే ఆరోగ్యానికి చింతేలేదు అంటుంటారు పెద్దలు. నోటికి పుల్లని రుచినిస్తూ మళ్లీ తినాలనిపిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో చింత చెట్లు చాలా ఉంటాయి. ప్రత్యేకంగా పల్లెలో మహిళలు సరదాగా అలా వెళ్లి చింతచిగురు జుర్రుకొని వస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో తొలికాపు చిగురును రుచి చూడందే వదలరు. వేడి వేడి అన్నంలో చింత పప్పుతో తింటుంటే ఆ రుచే వేరయ్యా అంటుంటారు భోజన ప్రియులు.

కేసు నమోదు

మిడుతూరు: నందికొట్కూరు – ఓర్వకల్లు ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై దాడి చేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్ మోహన్ సోమవారం తెలిపారు. ఆదివారం రాత్రి ఓర్వకల్లు బస్సు వస్తుండగా చింతలపల్లి గ్రామ శివారులో గుర్తు తెలియని ఆకతాయిలు బస్సు అద్దానికి రాయితో కొట్టగా డ్రైవర్ వలి తలకు రక్త గాయమైంది. గాయమైన వలితో పాటు కండక్టర్ శేషన్న స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మహిళ ఆత్మహత్య

చాగలమర్రి: మండలంలోని తోడేండ్లపల్లె గ్రామంలో బంధువుల మధ్య జరిగిన వాగ్వాదం, దూషణలతో మనస్థాపం చెందిన పల్లపు భాగ్యలక్ష్మి (28) ఇంట్లో ఎవరూ లేని సమయంలో సోమవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్ఐ రమణయ్య తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మంజుల సుహాసిని, మంజుల చిన్న సోడన్న ఆదివారం గొర్రెల విషయంలో భాగ్యలక్ష్మి ఆమె తల్లిదండ్రులైన చౌడేశ్వరి, జయన్న మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో భాగ్యలక్ష్మితో పాటు ఆమె తల్లిదండ్రులు తమను దూషించడంతో పాటు చంపుతామని బెదిరించారని సోడన్న ఫిర్యాదు చేయడంతో పోలీసులు మృతురాలి తండ్రి జయనన్నను విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్‌కు సోమవారం తీసుకెళ్లారు. అదే సమయంలో తల్లి చౌడేశ్వరి పొలం పనులకు వెళ్లింది. దీంతో మనస్థాపం చెందిన భాగ్యలక్ష్మి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. చాగలమర్రి నుంచి ఇంటికి వచ్చిన జయన్న కుమార్తె ఉరికి వేలాడుతుండటాన్ని చూసి బోరున విలపించాడు. తనను, తల్లిదండ్రులను దూషించడంతో తన కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని జయన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆళ్లగడ్డ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు. కాగా మృతురాలు పదేళ్ల క్రితం ఉపాధి నిమిత్తం సౌదీకి వెళ్లింది. మూడు నెలల క్రితం తిరిగి వచ్చి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది.